## క్లుప్తంగా

### తెర్లాంలో 'చదవడం మాకిష్టం'



విద్యార్థితో పుస్తకం చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

**తెర్లాం:** స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయానికి విచ్చేసిన విద్యార్థులతో లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి పుస్తకాలు చదివించడం, కథలు చెప్పించడం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. మంచి పుస్తకాలు చదవడం ద్వారా మంచి జ్ఞానం అలవడుతుందన్నారు.

### వైభవంగా చందనోత్సవం



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

**మెంటాడ:** వైశాఖమాసం పురస్కరించుకుని, స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో చందనోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు పీసపాటి కృష్ణమాచార్యులు స్వామి వారిని చందనంతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మాచర్ల అప్పారావు, ముప్పిడి నగేష్, పాండ్రంకి వరహాలరావు, కొల్లా భరత్, వల్లూరి జనార్దన్ పాల్గొన్నారు.

### వాసవీ క్లబ్ ఔదార్యం



పండ్ల వ్యాపారికి గొడుగు అందజేస్తున్న వాసవీ క్లబ్ వనిత కాంతి కిట్టి సభ్యులు

**రాజాం సిటీ:** పట్టణానికి చెందిన వాసవీ క్లబ్ వనిత కాంతికిట్టి మనరాజాం సభ్యులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకుని, వడదెబ్బ బారినపడకుండా పలు వీధులు, ప్రధాన కూడళ్లలో చిరువ్యాపారం చేసుకుంటున్న వారికి గొడుగు, వాటర్ బాటిల్, విసనకర్ర, తువ్వాలు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు కొల్లా శాంతి, ఎం.కృష్ణవేణి, హెచ్.సుబ్బలక్ష్మి, వి.ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

### క్రీడాసామగ్రి వితరణ



విద్యార్థులకు వాలీబాల్‌లు అందజేస్తున్న దాతలు

**సంతకవిటి:** మండలంలోని సిరిపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆ గ్రామానికి చెందిన ఉద్యోగులు అక్కలపోతు శ్రీరాములు, అదపాక ప్రకాశరావు, పాండ్రంకి శ్రీనివాసరావు, బడ్డెపు సన్యాసిరావు ఆదివారం క్రీడాసామగ్రి వితరణ చేశారు. విద్యార్థులను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు ఆరు వాలీబాల్‌లు, మరో పది స్కిప్పింగ్ రోప్‌లను అందజేసినట్లు పీడీ కె.సన్నిబాబు తెలిపారు.

### నేలరాలిన మామిడి



శ్యాంపురంలో ఈదురుగాలులకు నేలరాలిన మామిడికాయలు

**రాజాం:** స్థానిక పట్టణ పరిసర ప్రాంతాల్లో శనివారం సాయంత్రం వీచిన భారీ ఈదురుగాలులకు చాలా దగ్గర జీడిమామిడి తోటల్లోని మామిడికాయలు నేలరాలాయి. సరిగ్గా పంట చేతికందే సమయంలో కాయలు రాలిపోవడంతో మామిడిరైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది పూత అంతంతమాత్రంగానే ఉందని, నిలబడిన పూత నుంచి వచ్చిన కాయలు ఇప్పుడు రాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరో నెలరోజుల్లో కోత దశకు వస్తాయని, అయితే వారం వ్యవధిలో రెండు సార్లు ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయని, వాటి ధాటికి టన్నుల కొద్దీ మామిడికాయలు నేలరాలాయన్నారు.

# జనం నినాదం.. మా నమ్మకం నువ్వే జగన్..



రేగిడి: మా నమ్మకం నువ్వే జగన్ అంటూ స్టిక్కర్లు చూపిస్తున్న కె.వెంకటాపురం గ్రామస్తులు

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంతో జనం నినాదం మా నమ్మకం నువ్వే జగన్ అయింది. ఎక్కడికి వెళ్లినా జై.. జగన్.. జయహో.. వైఎస్సార్ సీపీ నినాదాలతో పార్టీ శ్రేణులకు ప్రజలు ఘనస్వాగతం పలుకుతున్నారు. బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ నేతలు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లంతా ఇంటింటికీ వెళ్లి, నాలుగేళ్లుగా ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచిని వివరించారు. గతంలోని టీడీపీ, ఇప్పటి వైఎస్సార్ సీపీకి పాలనలో ఉన్న తేడాను గమనించాలని, ప్రజాసంక్షేమం, రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధికి కృషిచేస్తున్న జగనన్న సర్కారును వచ్చే ఎన్నికల్లోనూ ఆశీర్వదించి, అధికారంలోకి తీసుకురావాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్



రాజాంలో ఇంటింటికీ వెళ్లి, పథకాలు వివరిస్తున్న పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ శ్రీనివాసరావు



రాజాం సిటీ: మారెడుబాకలో ప్రచారం చేస్తున్న గృహసారథులు



రాజాం సిటీ: జగనన్నే మా భవిష్యత్ అని స్టిక్కర్లు చూపిస్తున్న యువత, చిన్నారులు



వంగర: లక్ష్మీపేటలో గృహసారథులతో కలిసి ప్రచారంలో ఎంపీపీ సురేష్ ముఖర్జీ



రామభద్రపురం: కొండపాలవలసలో వైఎస్సార్ సీపీ నాయకుల ప్రచారం



రేగిడి: కొండలమామిడివలసలో ప్రచారం చేస్తున్న పార్టీ నేతలు



తెర్లాం: నందిగాంలో జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం



సంతకవిటి: మిర్తివలసలో ప్రభుత్వం చేస్తున్న మేలును వివరిస్తున్న సర్పంచ్ లక్ష్మీనీరజభూపతి నాయుడు, ఎంపీటీసీ చిన్నమ్మడు

## వైభవంగా ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేకాలంకరణలో పైడితల్లి అమ్మవారు

**తెర్లాం:** మండల కేంద్రంలోని శ్రీపైడితల్లి అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే భక్తులు ఆలయానికి విచ్చేసి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జరిగిన అన్నసమారాధనలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.



సంతకవిటి: కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

**సంతకవిటి:** మండలంలోని కాకరాపల్లి గ్రామంలో రామలింగేశ్వర, సంతోషిమాత, నవగ్రహ, నాగబంధ సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల 28వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయానికి పోటెత్తిన భక్తులు కుంకమ పూజలు చేశారు. అనంతరం స్వామికి ప్రత్యేకాభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో చేపట్టిన అన్నదాన కార్యక్రమంలో 3 వేల మంది పాల్గొని, అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పులఖండం తిరుమల ప్రసాద్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### నేడు అలజంగిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

**బొబ్బిలి:** మండలంలోని అలజంగి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం అధికారులు ఆదివారం తెలిపారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు పాల్గొంటారని, మండల స్థాయి నేతలు, అధికారులంతా హాజరు కావాలని కోరారు.

### ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



భక్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆధ్యాత్మిక వక్త రమణ

**రేగిడి:** ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత అని, ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలని పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎన్వీ రమణ తెలిపారు. మండలంలోని దేవుదళ గీతాశ్రమంలో ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజులో ఎంతో కొంత సమయం దైవనామ స్మరణ, దైవసేవకు కేటాయించాలన్నారు. ప్రతిరోజూ దైవాన్ని ఆరాధించడంతో పాటు పరులకు ఉపకారం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక గురువు గొర్లె దామోదరరావు, సామంతుల దామోదరరావు, ఎస్.త్రినాధస్వామి తదితరులు పాల్గొన్నారు.

### సిమెంట్ బెంచీల ఏర్పాటు

**తెర్లాం:** పట్టణానికి చెందిన దత్తి లక్ష్మణరావు తన భార్య దత్తి సుజాత జ్ఞాపకార్థం స్థానిక బిర్లంగిమాత ఆలయానికి సిమెంట్ బెంచీలు అందజేశారు. ఆదివారం ఆమె ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆలయ ఆవరణలో వాటిని ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులు కాసేపు కూర్చొని, సేదతీరేందుకు ఇవి ఉపయోగపడతాయన్న ఉద్దేశ్యంతో వాటిని ఇచ్చినట్లు దాత తెలిపారు. అలాగే వెయ్యి మందికి మజ్జిగ ప్యాకెట్లు వితరణ చేశారు.

### యుద్ధప్రాతిపదికన పైపులైన్ మరమ్మతులు



తెలగవీధి సమీపంలో జరుగుతున్న పైపులైన్ మరమ్మతులు

**రాజాం సిటీ:** స్థానిక తెలగవీధి సమీపంలో మెయిన్ రోడ్డుపై ఉన్న పైపులైన్ లీకులకు గురై, తాగునీరు వృథాగా పోతోంది. దీంతో కుళాయిల ద్వారా తక్కువ నీరు వస్తుండడంతో స్థానికులు గంటల కొద్దీ కుళాయిల వద్దే వేచి చూడాల్సిన దుస్థితి. ఈ విషయం తెలుసుకున్న సిబ్బంది ఆదివారం యుద్ధప్రాతిపదికన పైపులైన్ మరమ్మతులు చేపట్టి, నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చేశారు. వేసవి నేపథ్యంలో మున్సిపాలిటీలో ఎక్కడా తాగునీటి ఇక్కట్లు లేకుండా జాగ్రత్త వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు తెలిపారు.

## పుస్తక పఠనంతో అపారమైన జ్ఞానం



తెర్లాం: పుస్తకాలు చూపిస్తున్న విద్యార్థులు

**తెర్లాం:** పుస్తక పఠనం ద్వారా అపారమైన జ్ఞానం అలవడుతుందని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ప్రపంచ పుస్తక దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను ప్రదర్శించారు. చిన్నప్పటి నుంచే పుస్తకాలు చదవడం బాగా అలవాటు చేసుకోవాలన్నారు. గ్రంథాలయంలో అనేక రకాలైన పుస్తకాలు ఉంటాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**బొబ్బిలి:** స్థానిక శాఖా గ్రంథాలయంలో ప్రపంచ పుస్తక దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ స్వర్ణకుమారి పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలను పాఠకులకు వివరించారు.



బొబ్బిలి: పుస్తక పఠనం ప్రయోజనాలు వివరిస్తున్న లైబ్రేరియన్ స్వర్ణకుమారి



సంతకవిటి: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు కృష్ణారావు

**సంతకవిటి:** మండలంలో మందరాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రపంచ పుస్తక దినోత్సవంతో పాటు ఇంగ్లిష్ భాషా దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు అదపాక దామోదరరావు పుస్తక పఠనం, ఇంగ్లిష్ ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దాసరి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

### రూ.2.60 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు

**రాజాం:** పట్టణంలోని బొబ్బిలి జంక్షన్ నుంచి గాయత్రీ కాలనీ వరకు, అలాగే అంబేడ్కర్ జంక్షన్ నుంచి జీఎంఆర్ ఐటీ వరకు దాదాపు రూ.2.60 కోట్ల వ్యయంతో రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నామని ఏపీఈపీడీసీఎల్ రాజాం ఏడీఈ జీవీ రమణ తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడిన ఆయన ప్రస్తుతం నిధులు మంజూరయ్యాయని, ఈ నిధులతో గాయత్రీ కాలనీ రోడ్డులో కొత్తగా విద్యుత్‌స్తంభాలు వేస్తున్నామన్నారు. రోడ్డుకు ఇరువైపులా స్తంభాలు వేయడంతో పాటు రోడ్డు మధ్యలో ఉండే డివైడర్లు మీదుగా కూడా వీధి దీపాలతో కూడిన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.



గాయత్రీ కాలనీలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కొత్తగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

## ఘనంగా ప్రపంచ ధరిత్రీ దినోత్సవం



మానవహారం చేపట్టిన విద్యార్థులు

**రాజాం:** మండలంలోని కొత్తవలస గ్రామంలో ప్రపంచ ధరిత్రీ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాజాం జీఎంఆర్‌వీఎఫ్ ప్రతినిధుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కుదమ తిరుమలరావు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి వీధుల్లో ర్యాలీలు, ప్రధాన కూడలిలో మానవహారం చేపట్టి, భూ పరిరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని వక్తలు కోరారు. కార్యక్రమంలో జీఎంఆర్‌వీఎఫ్ ప్రతినిధులు లావేటి రాజు, పొట్నూరు గోవిందరావు, దువ్వా వాసుదేవరావు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

**బాడంగి:** ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం ముగడ యూనిట్ ఇన్‌చార్జ్ పి.సూర్యలక్ష్మి తెలిపారు. మండలంలోని ముగడ, పాల్తేరు, భీమవరం గ్రామాల్లో ఆదివారం గ్రామసభ నిర్వహించి, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. అనంతరం ఖరీఫ్–2023–24 సాగుకు సంబంధించి, ప్రణాళికలు రూపొందించి కాసేపు మాట్లాడారు. ప్రస్తుతం పెరిగిన ధరలతో వ్యవసాయానికి అవుతున్న పెట్టుబడి విపరీతంగా పెరిగిపోయిందని, ప్రతీ రైతుల ప్రకృతి వ్యవసాయం వైపు ఆసక్తి చూపాలని ఆమె కోరారు. ఈ వ్యవసాయంలో సేంద్రియ ఎరువులు, నవధాన్యాల సాగు ద్వారా నేలసారవంతం కావడంతో పాటు ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయన్నారు. అనంతరం రైతులకు నవధాన్యాల కిట్లను అందజేశారు. కార్యక్రమంలో యామల శివప్రసాద్, యామల సత్యనారాయణ, చప్ప తిరుపతినాయుడు, ఎల్. అప్పలనాయుడు, ఉడమల అప్పలనాయుడు, వంగపండు జోగినాయుడు, ఐసీఆర్‌పీ గౌరమ్మ, వెంకటరమణ పాల్గొన్నారు.



ముగడలో రైతులకు నవధాన్యాల కిట్లు అందజేస్తున్న దృశ్యం

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్న సిబ్బంది

**బాడంగి:** మండలంలోని కోడూరు గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. విశాఖపట్నం జిల్లా, తగరపువలసకు చెందిన అనిల్ నీరుకొండ ఆస్పత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దాదాపు 350 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులు అందజేశారు. 48 మందికి శస్త్రచికిత్స అవసరం కాగా ఆరోగ్య శ్రీ ద్వారా వారికి ఆపరేషన్ చేయనున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రెడ్డి కృష్ణ, ఆస్పత్రి మేనేజర్ త్రినాథ, పీఆర్‌ఓ కృష్ణ, వైద్యులు ప్రశాంత్, ప్రవల్లిక, రామానుజులు, అభిరాం, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణకు కేంద్రం చొరవ తీసుకోవాలి

- ఉత్తరాంధ్ర ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జ్ ముమ్మిడివరపు చినసుబ్బారావు

**బొబ్బిలి:** ఎస్సీ వర్గీకరణకు కేంద్రం చొరవ తీసుకోవాలని ఉత్తరాంధ్ర ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జ్ చినసుబ్బారావు కోరారు. ఆదివారం స్థానిక పట్టణంలోని విలేకరులతో మాట్లాడిన ఆయనదేశంలోని అనేక రాష్ట్రాలు ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీల్లో తీర్మానాలు చేసి, ప్రతిపాదనలు పంపిస్తున్నాయన్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల నుంచి ఈ తరహా ప్రతిపాదనలు కేంద్రానికి వెళ్లాయని, అయితే మోదీ సర్కారు వాటిని ఏమాత్రం పట్టించుకోవడం లేదని విచారం వ్యక్తం చేశారు. త్వరలోనే ఇదే విషయమై కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. మే 25వ తేదీ నుంచి ఎమ్మార్పీఎస్ సాధించిన విజయాలను ప్రజలకు తెలియజేసేందుకు మిషన్–50 కార్యక్రమం ప్రారంభిస్తున్నామని, మే 22వ తేదీన దీనికి సంబంధించి, బహిరంగ సభ కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బోగి శ్రీనివాసరావు, నియోజకవర్గ అధ్యక్షుడు కింతలి రాము తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జ్ ముమ్మిడివరపు చినసుబ్బారావు

## • పండగ సందడి

ఓ వైపు బొబ్బిలిలో జరుగుతున్న దేశమ్మ తల్లి వారాలతో, మరోవైపు సోమవారం నుంచి ఆరంభమయ్యే గ్రామదేవతల ఉత్సవాలతో ఎం.బూర్జవలస, కోమటపల్లి గ్రామాల్లో పండగ సందడి నెలకొంది. ఇప్పటికే గ్రామానికి చేరుకున్న బంధుమిత్రులతో గ్రామస్తులు సరదాగా కాలక్షేపం చేస్తున్నారు. దేశమ్మతల్లి వారాల్లో భాగంగా బొబ్బిలిలోని కోరాడ వీధిలో ఆదివారం పలువురు కళాకారులు వేసిన అమ్మవార్ల వేషధారణలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

– బొబ్బిలి



ఆకట్టుకున్న అమ్మవార్ల వేషధారణలు